ప్రజాశక్తి
శనివారం 17 మే 2025
5
విజయనగరం



ఎపిఇసెట్‌లో ఎంఆర్ ఫార్మసీ విద్యార్థుల హవా

ప్రజాశక్తి-విజయనగరంటౌన్





చంద్రిక (34), సోమేశ్వరరావు(39)

స్థానిక మహారాజా ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఈ 6న నిర్వహించిన ఎపి ఈసెట్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల నుండి 33 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా అందులో 31 మంది అర్హత సాధించారు. ఇందులో 100 లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఐదుగురు ఉన్నారని తెలిపారు. ఎ.చంద్రిక 34వ ర్యాంక్, పి.సాయి సోమేశ్వరరావు 39, కె.నవ్య 50, జి.నిఖిల్ 73, ఎం.శైలజ 81 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.



పిచ్చిమొక్కలతో నిండిపోయిన కుడి కాలువ

ఖరీఫ్‌కు

సాగునీరందేనా?

- అధ్వానంగా సాగునీటి కాలువలు
- ప్రధాన గేట్లకు లీకులు
- వృథాగా పోతున్న సాగునీరు
- మడ్డువలస రైతులకు ఏటా తప్పని అవస్థలు
- పూడికతీత పనులు చేపట్టాలని డిమాండ్

ప్రజాశక్తి-వంగర

మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతుంది. ప్రస్తుతం వర్షాలు కూడా అనుకూలంగా కురుస్తుండటంతో రైతులు కూడా తమ తమ పొలాలలో దుక్కులు వేసి ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మడ్డువలస ప్రాజెక్టు పరిధి రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వేల ఎకరాలకు సాగు నీరు అందించాల్సిన కుడి, ఎడమ కాలువల్లో పిచ్చి మొక్కలు చెత్తాచెదారాలు పూడికతో నిండిపోయి కాలువలు రూపు కోల్పోయి అధ్వానంగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్నప్పటికీ కనీసం పూడిక తీత పనులు కూడా ఇప్పటివరకు చేపట్టలేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు అందుతుందో లేదోనన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

మండలంలోని గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టు నుంచి వంగర, రేగిడి, సంతకవిటి మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని జి. సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల, లావేరు మండలాల్లో 37, 377 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందులో స్టేజ్ 1 లో వంగర మండలంలో 996, రేగిడి మండలంలో 6,777, సంతకవిటి మండలంలో 10,976, జి.సిగడాం మండలంలో 6029, పొందూరు మండలంలో 99 ఎకరాలకు మొత్తం 24, 877, ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. స్టేజ్ 2లో జి.సిగడాం మండలంలో 536, పొందూరు మండలంలో 5173, లావేరు మండలంలో 5474, ఎచ్చెర్ల మండలంలో 1317 ఎకరాలు మొత్తం 12500 ఎకరాలకు నీరు అందించవలసిన ఈ ప్రాజెక్టు 20ఏళ్లు గడిచినప్పటికీ శివారు భూములకు నీరు అందించలేని దుస్థితి నెలకొంది. ప్రధాన కాలువ పనులు కూడా పూర్తి కాకపోవడంతో ఆయా మండలాల రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పిల్ల కాలువలు సైతం అధ్వానంగా ఉన్నాయి దీంతో ఆయకట్టు రైతులు ఏటా సాగునీటికి అవస్థలు పడుతున్నారు.



గేట్లు మరమ్మతులకు గురవడంతో వృథాగా పోతున్న సాగునీరు

వృథాగా పోతున్న సాగునీరు

మడ్డువలస ప్రాజెక్టు ప్రధాన గేట్ల వద్ద లీకులు కావడంతో ప్రాజెక్టులో ఉన్న సాగునీరు వృథాగా పోతుంది. దీన్ని మరమ్మత్తులు చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంతో కొన్ని గేట్లుకు మాత్రమే మరమ్మతులు చేసి మిగతా వాటిని బాగు చేయకపోవడంతో వందల క్యూసెక్కుల నీరు వృథాగా పోతుంది.

అధికారులు దృష్టి సారించాలి



మడ్డువలస ప్రాజెక్టుకు సమీపంలో నాకు మూడు ఎకరాల భూమి ఉంది, కాలువలు సక్రమంగా లేనందువలన ఏటా ఖరీఫ్‌లో సాగునీరు అందక చాలా ఇబ్బందులు పడుతున్నాం. బోర్లు పైన ఆధారపడి చాలా నష్టపోతున్నాం. అధికారులు దృష్టి సారించి కాలువలు బాగు చేసి సాగునీరు అందించాలి.

గేదెల లక్ష్మి నారాయణ, సంగాం, వంగర మండలం.

పట్టించుకోవటం లేదు



ఎడమ కాలువ గట్లు చాలా బలహీనంగా ఉండటంవల్ల నీరంతా తంపర భూములకు వృథాగా వెళ్లిపోతుంది. ఈ విషయం అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని కాంక్రీట్ పనులు చేపట్టాలి.

పోలిరెడ్డి చంద్రి నాయుడు, మగ్గూరు, వంగర మండలం

పూడిక తీత పనులు చేపడతాం



మడ్డువలస ఎడమ ప్రధాన కాలువకు సంబంధించి ఎస్‌డిఎం ఎఫ్ నిధులతో పూడికతీత పనులు త్వరలోనే చేపడతాం. కుడి ప్రధాన కాలువలో ప్రస్తుతం అక్కడక్కడ పూడిక తీత పనులు చేపడుతున్నాం. ప్రాజెక్టు 3 ప్రధాన గేట్లు కు సంబంధించి రబ్బర్ సీల్స్ వేయవలసి ఉంది. కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు పూర్తి చేసి లీకులు అరికడతాం.

– పి.అర్జున్, డిఇ, మడ్డువలస ప్రాజెక్టు

ఎయిర్‌పోర్టు ప్రాంతంలో

స్టార్ హోటళ్లు, రిసార్టుల నిర్మాణం

పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ • కలెక్టర్ అంబేద్కర్‌తో కలిసి పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతున్న తరుణంలో పర్యాటకుల వసతి కోసం అవసరమైన హోటళ్లు, రిసార్టుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ చెప్పారు. భోగాపురం ప్రాంతంలో నిర్మాణంలోఉన్న, ఏర్పాటు కానున్న పలు హోటళ్లు, రిసార్టులను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. రెడ్డికంచేరు వద్ద సన్‌రే– అవని గ్రూపు ఆధ్వర్యంలో రూ.100 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బీచ్ రిసార్ట్స్‌ను, కవులవాడ వద్ద ఇదే గ్రూపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం పనులను పరిశీలించారు. సుమారు 3 వేల మందికి వసతి కల్పించేలా కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని సన్‌రే గ్రూపు ఎమ్‌డి రాజబాబు ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శికి వివరించారు. అక్కడ సన్‌రే గ్రూపు ఆధ్వర్యంలో నిర్మించిన బీచ్ రిసార్టులు, గోల్ఫ్ కోర్టును పరిశీలించారు. సవరవల్లి ప్రాంతంలో సన్‌రే రిసార్టుకు అనుబంధంగా ఏర్పాటు చేయనున్న త్రీ స్టార్ హోటల్ ప్రాజెక్టుకు ఆ ప్రాంతంలో అందుబాటులో వున్న 3.6 ఎకరాల ప్రభుత్వ భూమి అందజేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్‌కు సూచించారు.

భీమిలి మండలం అన్నవరం సముద్రతీరంలో రూ.40కోట్ల వ్యయంతో ఏర్పాటవుతున్న మే ఫెయిర్ హోటల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి భూముల కేటాయింపులపై భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్‌తో మాట్లాడారు. హోటల్‌కు రహదారి నిర్మాణంపై కూడా ఆరా తీశారు. అన్నవరం వద్ద ఓబెరాయ్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్మాణంలో వున్న ఫైవ్ స్టార్ హోటల్‌ను పరిశీలించి నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలపై ఆ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.



హోటల్ నిర్మాణాలను పరిశీలిస్తున్న అజయ్‌జైన్, కలెక్టర్ అంబేద్కర్

విజయనగరంలో రోడ్లు భవనాల శాఖ స్థలంలో స్టార్ హోటల్ నిర్మించడం ద్వారా పర్యాటకుల వసతుల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు అజయ్ జైన్ సూచించారు. ఈ స్థలంలో హోటల్ నిర్మాణం ద్వారా అతిథిగృహం నిర్మాణంతోపాటు హోటల్ కూడా ఏర్పాటు చేయవచ్చని తద్వారా రోడ్లు భవనాల శాఖకు కూడా ఆదాయం సమకూరుతుందన్నారు.

గృహనిర్మాణానికి అదనపు సహాయం ప్రకటించినందున నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకుసూచించారు. గృహనిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మురళి గృహనిర్మాణ ప్రగతిపై వివరించారు. పర్యటనలో పర్యాటక శాఖ ప్రాంతీయ డైరక్టర్ జి.వి.బి.జగదీష్, జిల్లా పర్యాటక అధికారి కుమారస్వామి, ఆర్‌డిఒ కీర్తి, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, తహశీల్దార్ సురేష్, విశాఖ జిల్లా పర్యాటక అధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం పనుల పరిశీలన

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ కలెక్టర్‌తో కలసి పరిశీలించారు. జిఎంఆర్ గ్రూపు సిఇఒ మన్మోయ్ రాయ్ ఎయిర్ పోర్టు విశేషాలను వివరించారు. నిర్ణీత గడువు కంటే ముందుగానే ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తిచేసే దిశగా పనులు జరుగుతున్నాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ శారదాదేవి

కూలీలు వలస వెళ్తే ఊరుకోను

అందరికీ పని కల్పించాలి.. పనికి తగ్గ వేతనమివ్వాలి

గోకులాలను పూర్తి చేస్తాం : డ్వామా పీడీ

ప్రజాశక్తి – సంతకవిటి

ఉపాధి కూలీలు వలసలు వెళ్తే ఊరుకోనేది లేదని, ప్రతి ఒక్కరికీ పని కల్పించి పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డ్వామా పీడీ ఎస్. శారదాదేవి అన్నారు. మండలంలోని చిత్తారపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫారం పాండ్స్, హార్టికల్చర్ పథకాలు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రజాశక్తి కథనానికి స్పందిస్తూ గోకులాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఉపాధి కూలీకి 100రోజులు పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. అనంతరం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈ ఏడాది ఏయే పనులు ఉన్నాయో మీకు తెలుసా అని ప్రశ్నించారు. పలు గ్రామాల్లో 100రోజులు పని ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టిలకు తప్పనిసరిగా 100రోజుల పనిని కల్పించాల్సిందే నన్నారు. ఉపాధి వేతనదారులు రెండు పూటలా పనిచేసినా పనికి తగ్గ వేతనం 307 రూపాయలు రాకుండా, కేవలం 105 రూపాయలే రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో మంచి నీటి కుండలను ఏర్పాటు చేయాలన్నారు. ఒఆర్‌ఎస్ ప్యాకెట్స్ వారానికి ఒక్కసారి సరఫరా చేస్తుడంటంతో మండిపడ్డారు. ప్రతిరోజు వైద్య సిబ్బంది పని ప్రదేశానికి వెళ్లాలన్నారు. ప్రతి నెల ఉపాధి వేతనదారులు హాజరు తగ్గు ముఖం పట్టడంతో ఎందుకు హాజరు తగ్గుతుందని ప్రశ్నించారు. కొన్ని నెలలుగా మంతిన, రామరాయ పురం, కాకరాపల్లి, గొళ్లవలస, మండవకురిటి, బొద్దూరు, సంతకవిటి ఫీల్డ్ అసిస్టెంట్లు లేక పనులు నిలిపివేయ్యడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు నియమించి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కూలీలకు పని కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫారం పాండ్స్, హార్టికల్చర్ పథకాలు లక్ష్యం చేరుకోవాలన్నారు. హార్టికల్చర్ ద్వారా రైతులు పంట పొలాల్లో మొక్కల పెంపకానికి 19రకాల మొక్కలను అందజేస్తుం దన్నారు. వీటిపై రైతులకు అవగాహన కల్పించాల న్నారు. సమావేశంలో ఎంపిడిఒ సురేష్ కుమార్, ఎపిఒ ఆర్.హరినాద్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా ర్యాలీ

ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యం : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఉగ్రవాదులను అంతం చేయడమే లక్ష్యమని రాష్ట్ర ఎస్‌ఎంఎస్ఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ కు మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. కోట వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ మూడులాంతర్లు మీదుగా గంటస్తంభం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో భారతీయులంతా ఐక్యంగా ఉంటే దేశం అభివృద్ధి చెందుతుం దన్నారు. కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ ఎన్నివందల సంవత్సరాలైన మన జాతీయ జెండా ఎగరాలన్నారు.మన మేధా శక్తి ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ దేశం మీదకు దాడి చేస్తే అందరూ ఐక్యంగా ముందుకు వెళ్లారన్నారు.ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు తెలిపిందన్నారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, బిజెపి జిల్లా అధ్యక్షులు రాజేష్‌వర్మ, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యసిస్విని, కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రజలు



రాజాంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సైనిక దళాలకు సంఘీభావంగా ర్యాలీ

రాజాం : 'ఆపరేషన్ సింధూర' విజయవంతం చేసిన భారత సైనికల దళాలకు సంఘీభావంగా ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ చేపట్టారు. టిడిపి కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా అంబేద్కర్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేసి అక్కడ మానవహారంగా ఏర్పడి 'తిరంగా యాత్ర' ఘనంగా చేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు అతీతంగా విద్యావంతులు, వ్యాపారవేతులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, యువతీ యువకులు, ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి జాతీయ జెండాలు పట్టుకుని పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టెర్రరిజానికి వ్యతిరేకంగా మన జవాన్లు చేసిన పోరాటాన్ని ప్రజలకు తెలియజేయాలనేదే 'తిరంగా యాత్ర' కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. అనంతరం డోలాపేటలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ కట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 18న ఉదయం 7:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ పరిసర ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని విద్యుత్తుశాఖ ఇఇ పి.త్రినాధరావు తెలిపారు. 33/11కెవి కలెక్టరేట్ సబ్ స్టేషన్ పరిధిలోగల 11 కెవి ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తము చెట్టు కొమ్మలను తొలగించే క్రమంలో కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయం, పోలీస్ బ్యారెక్స్ పరిసరాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తామని తెలిపారు.



లారీని ఢీకొని మృతి చెందిన యువకులు వెంకటరావు, సురేష్

ఆగి ఉన్న లారీని ఢీకొని

ఇద్దరు యువకులు దుర్మరణం

రాకోడులో విషాదం

ప్రజాశక్తి- డెంకాడ

అప్పటి వరకూ స్నేహితుడి పెళ్లిలో సందడి చేసిన ఆ ఇద్దరు యువకులు గంటల వ్యవధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. దీంతో వారి స్వగ్రామం రాకోడులో విషాదం అలుముకుంది. చిన్ననాటి స్నేహితులైన వీరు ఒకేసారి మృతి చెందడంతో మృత్యువులోనూ వీడని బంధంగా మిగిలి పోయారు.

మండలంలోని విజయనగరం–విశాఖపట్నం జాతీయ రహదారి మోదవలస ఫ్రెష్ చాయిస్ కంపెనీ వద్ద శుక్రవారం తెల్లవారుజామున బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. విజయనగరం మండలం రాకోడు గ్రామానికి చెందిన రావాడ వెంకట్రావు (32), గొర్లె సురేష్ (35) కలిసి ద్విచక్ర వాహనంపై విజయనగరం నుంచి విశాఖపట్నం వైపు వెళుతుండగా మోదవలస వద్ద ఆగి ఉన్న ట్రాలీ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. దీంతో ఇద్దరు వ్యక్తులకు తలలకు బలంగా గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతులిద్దరికీ తల్లిదండ్రులతో పాటు భార్య, పిల్లలు ఉన్నారు. స్నేహితులైన వీరిద్దరూ ఇటీవలే విశాఖపట్నం జిల్లా పరవాడ కంపెనీలో చేరారు. అక్కడే ఉంటున్నారు. బొండపల్లి మండలం గొల్లుపాలెం లో జరిగిన తమ స్నేహితుని పెళ్లికి వెళ్లి తిరిగి శుక్రవారం తెల్లవారి వస్తుండగా ప్రమాదం జరిగింది. స్థానిక ఎస్ఐ.సన్యాసి నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలిం చారు. కుమారుల మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. అప్పటివరకూ తమతో సరదాగా ఉంటూ అంతలోనే ప్రాణాలు కోల్పో వడంతో స్నేహితుల్లోనూ విషాదం నలెకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ రవాణా నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు

పట్టుబడిన 20.5 కిలోల గంజాయి, నలుగురు నిందితులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో గంజాయి, మద్యం, పేలుడు సామగ్రి, డ్రగ్స్, గుట్కాల అక్రమ రవాణ నియంత్రణకు, అనుమానస్పద వ్యక్తులను గుర్తించి, వారిని అదుపులోకి తీసుకొనేందుకు ప్రయాణికులతో రద్దీగా వెళ్లే మూడు రైళ్లను లక్ష్యంగా చేసుకొని పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. చీపురుపల్లి, బొబ్బిలి, ఎస్.కోట రైల్వే స్టేషన్లులో పోలీసు అధికారులు, సిబ్బంది, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీలు చేపట్టినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. బొబ్బిలి రైల్వే స్టేషనులో కోరాపుట్ నుంచి విశాఖపట్నం వెళ్లే డిఎంయు, చీపురుపల్లి రైల్వే స్టేషనులో గుణుపూరు నుండి విశాఖపట్నం వెళ్లే ట్రైన్, ఎస్.కోట రైల్వే స్టేషనులోకిరండోల్ నుండి విశాఖపట్నం వెళ్లే రైళ్లలో పోలీసులు విస్తతంగా తనిఖీలు నిర్వహించారు. ఒక్కొక్క కంపార్టుమెంటును ఇద్దరు ఎస్‌ఐల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, డాగ్, బాంబ్ స్క్వాడ్స్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 20.5 కిలోల గంజాయి, నలుగురు నిందితులు పట్టుబడగా, తదుపరి చర్యల నిమిత్తం జిఆర్‌పి పోలీసులకు అప్పగించారు. తనిఖీలను డిఎస్‌పిలు ఎం.శ్రీనివాస రావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘవులు పర్యవేక్షించగా, బొబ్బిలి సిఐ కే.సతీష్ కుమార్, చీపురుపల్లి సిఐ శంకర్రావు, రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్.కోట సిఐ వి.నారాయణ మూర్తి, ఎస్.కోట రూరల్ సిఐ ఎల్. అప్పల నాయుడు, కొత్తవలస సిఐ సిహెచ్.షణ్ముఖ రావు, ఎల్. భాస్కరరావు, శోభన్‌బాబు, 30మంది ఎస్‌ఐలు, 150మంది పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.



రైలులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్‌పి వకుల్ జిందాల్ శుక్రవారం పోలీసువెల్ఫేర్‌డే నిర్వహించారు. వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, సిబ్బంది నుంచి విజ్ఞాపనలు స్వీకరించి, పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దోమల వ్యాప్తిని నివారించి, డెంగీని ఓడించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.జీవన్ రాణి, విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరపాలక సంస్థ కార్యాలయం నుండి ర్యాలీ చేపట్టారు. అంతకు ముందు డెంగ్యూ వ్యాప్తి నివారణకై తీసుకోవలసిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. డెంగ్యూ నివారణకు కలిసికట్టుగా చేయవలసిన పద్ధతులపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జీవన్ రాణి మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుందని అన్నారు. పరిశీలించడం, శుభ్రం చేయడం, మూతలు పెట్టడం వంటి విధానాలతో డెంగ్యూ వ్యాధిని కొంతవరకు దూరం చేయవచ్చునని చెప్పారు. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించడం ద్వారా దోమల నివారణకు అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి కె.రాణి, సీనియర్ ఎంతనాలజిస్ట్ వరప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి డివి రమణ పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ జీవనరాణి

ఉష్ణ తాపం నుంచి రక్షణకు బీట్ ది హిట్ కార్యక్రమాలు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బీట్ ది హిట్ కార్యక్రమం ద్వారా ఉష్ణతాపం నుండి ప్రజలకు ఉపశమనం కలిగించే పలు రకాల చర్యలను చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య వెల్లడించారు. శుక్రవారం అనేక ప్రాంతాలలో పక్షుల కోసం మట్టి పాత్రలను ఏర్పాటు చేసామన్నారు. ప్రజలు కూడా మరింత అవగాహన పెంచుకొని పక్షుల కోసం తమ తమ ఇళ్ల వద్ద మట్టి పాత్రలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పశువుల కోసం కొన్ని ప్రాంతాలలో నీటి తొట్టెలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే వాహనచోదకులకు ఇబ్బందులు కలుగకుండా పలు ప్రాంతాలలోని సిగ్నల్ పాయింట్ల వద్ద హరిత కూడళ్ళ పేరిట షెడెడ్ నెట్లను ఏర్పాటు చేసామన్నారు. శనివారం స్వర్ణాంధ్ర దివస్ నేపథ్యంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో విరివిగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.

పాఠశాలలపై ప్రయోగాలు వద్దు : ఆప్టా

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలపై ప్రయోగాలు వద్దని అప్టా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎజి ఎస్ గణపతిరావు, కె.ప్రకాశరావు ప్రభుత్వాన్ని కోరారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జీవో 117 వలన ప్రాథమిక విద్య దెబ్బ తిన్నది అనే ఉద్దేశంతో కొత్త విధానం ను అమలు చేయడం హర్షణీయమైనా, తాజాగా కూడా కొన్ని అసంబద్ధ నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏర్పడే ఫౌండేషన్ పాఠశాలల్లో 1:20 ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని పాటించాలన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో హెచ్‌ఎంలుగా ఎస్‌జిటిలనే నియమించాల న్నారు. ఉన్నత పాఠశాలలో 45మంది విద్యార్థులకు ఒక సెక్షన్ గా గుర్తించాలని కోరారు. ఎస్‌జిటిలకు మాన్యువల్‌గానే బదిలీలునిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఏకపక్ష నిర్ణయాలు సరికాదు : పిఆర్‌టియు

రాష్ట్ర విద్యా శాఖ అధికారుల ఏక పక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలు సరికాదని పి అర్‌టియు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వి. రవీంద్ర నాయుడు, డి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం తమ సంఘం కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీవో 117 రద్దు తదనంతరం పరిణామాలు వలన ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. 9 రకాల పాఠశాలలు వలన భవిష్యత్తులో నష్టమే తప్ప లాభం లేదన్నారు. గతంలో మాదిరి ప్రైమరీ, యుపి,హై స్కూల్ విధానం కొనసాగించా లన్నారు .ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ఒక్కో పాఠశాలలో ఒక్కోలా అమలు చేస్తున్నారని, ఇది సహేతుకం కాదని అన్నారు. అన్ని రకాల పాఠశాలల్లోనూ ఒకే నిష్పత్తి పాటించాలన్నారు. ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్ట్ స్కూల్ అసిస్టెంట్స్‌తో నింపడం న్యాయం కాదన్నారు. ఎస్‌జిటిలకు పదోన్నతులు ఇచ్చి వారితోనే నింపాలన్నారు. సమావేశంలో మీడియా ఇన్‌ఛార్జి బి.శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంబాబు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికావొద్దు

రామభద్రపురం: ప్రస్తుత వేసవి ఎండలు మెండుగా ఉన్నాయని ప్రజలు అవసరమైతేనే బయటకు వెళ్లాలని లేకపోతే ఇంటి ప్రదేశంలో ఉండాలని వడదెబ్బకు గురికావద్దని స్థానిక వైద్యాధికారి దిలీప్ కుమార్ సూచించారు. పిహెచ్‌సిలో శుక్రవారం వడదెబ్బకు గురైన రోగులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10లోపు సాయంత్రం 3 తరువాత బయటకు వెళ్లాలన్నారు. ఓఆర్‌ఎస్ ద్రావణం ఎక్కువగా తీసుకోవాలని, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్ల దగ్గర ఈ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సీజన్లో ఎక్కువగా జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, దానిపై కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భూమి ఆన్‌లైన్‌పై ఫిర్యాదు

భోగాపురం: తమ భూమిని వేరొక వ్యక్తులు ఆన్‌లైన్ చేసుకొని అమ్మేసారంటు ఉడెం గ్రామానికి చెందిన రైతులు తహశీల్దార్ ఎమ్ సురేష్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఉడెం గ్రామానికి చెందిన దుప్ప రాములప్పన్న అప్పయ్యమ్మ, సూర్యనారాయణ ఈ ముగ్గురు రైతులు ఫిర్యాదు చేశారు. భూమిపై సాగులో లేనప్పటికీ తన తండ్రి పేరు మీద వచ్చిన ఆన్‌లైన్‌లో చూపిస్తుందని తన పేరు మీద ఆన్లైన్ చేసుకుని వేరొక వ్యక్తులకు అమ్మేసారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి తమ పేరు మీద ఆన్లైన్ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

గురుకుల విద్యార్థులకు పురస్కారాలు

బొబ్బిలిరూరల్: కోమటిపల్లి యంజెపి గురుకుల పాఠశాలలో ఇటీవల పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి మొదటి మూడు ర్యాంకులు సాధించిన వారికి బీసీ మంత్రి యెస్. సవిత చేతుల మీదుగా పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి చోడవరపు శివ 592 మార్కులతో రాష్ట్రంలో రెండవ ర్యాంకు సాధించి నందుకు గాను రూ.15వేలు, సెనెటి మోహన్ 591 మార్కులతో 3వ ర్యాంకు సాధించినందుకు రూ. 10వేలు నగదు బహుమతులు, వీటితో పాటు, మెమొంటో, అభినందన ధ్రువపత్రం అందజేశారు. శతశాతం ఉత్తీర్ణత సాధించినందుకు ప్రిన్సిపాల్ పురుషోత్తకి సన్మానం చేశారు.

ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు

భోగాపురం: రాజపులోవ గ్రామంలోని శ్మశాన వాటికను కొంతమంది వ్యక్తులు ఆక్రమించారంటూ గ్రామానికి చెందిన కలిదిండి వెంకటరమణతో పాటు పలువురు డిప్యూటీ తహశీల్దార్ హరీన్‌కు ఫిర్యాదు చేశారు. ఆక్రమించిన స్థలంలో పాకలు వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఆరు కులాలు వారు అవసరమైన శ్మశాన వాటికను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్రమణలు తొలగించి న్యాయం చేస్తామని డిప్యూటీ తహశీల్దార్ హామీ ఇచ్చారు.

కాలుష్య నివారణకు చర్యలు తీసుకోండి

బొబ్బిలి: గ్రోత్ సెంటర్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ఎపిజె అబ్దుల్ కలాం యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జి.లక్ష్మణరావు, సభ్యులు రమేష్, గణేష్, శ్రీనివాసరావు కోరారు. కాలుష్యాన్ని నివారించాలని శుక్రవారం ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేశారు. గ్రోత్ సెంటర్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు, కాలుష్యాన్ని నివారించి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.బుజ్జి తదితర యువకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కిట్లు పంపిణీ

జామి: మండలంలోని జాగారం గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులకు ఆ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు కిట్లను శుక్రవారం అందజేశారు. గ్రామ సర్పంచ్ పసి పార్వతి, వార్డు సభ్యులు ప్రసాద్, రాములు చేతుల మీదుగా పని ప్రదేశాలలో వినియోగించే గ్లౌజ్, సర్ఫ్‌తో పాటు మరికొన్ని సేఫ్టీ వస్తువులను అందజేశారు. వీటిని పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కొనుగోలు చేసినట్లు సర్పంచ్ పార్వతి చెప్పారు. కార్యక్రమంలో వశి రాము పలువురు పెద్దలు పాల్గొన్నారు.

సోలార్ వినియోగాన్ని అలవర్చుకోవాలి

శృంగవరపుకోట: ప్రజలందరూ సోలార్ వినియోగాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలో రేణుక సోలార్ షోరూమ్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా సబ్సిడీపై సోలార్ పరికరాలు లభిస్తున్నాయని వీటిని ఉపయోగించి విద్యుత్ బిల్లులు లేకుండా చేసుకోవడమే కాకుండా తిరిగి ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నారిని రామనాజీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి చక్క కిరణ్, అనకాపల్లి పెల్లయ్య, క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, పెదగాడ రాజు, బోనంగి జ్యోతి, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ.15 వేలు ఆర్థిక సాయం

వేపాడ: మండల కేంద్రంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పాడి ఆవులను కోల్పోయిన నిరుపేద కృష్ణకు పాల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి వేపుడు బాబు పాల సొసైటీ ఎస్‌కెకె యూనిట్ డిజిఎం శివాజీ చేతుల మీదుగా శుక్రవారం రూ.15వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడి నుంచి గనివాడ వేళ్ళు లింకు రోడ్డుకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు మౌలిక సదుపాయాలలో భాగంగా రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాంప్రసాద్, కొత్తవలస ఎఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లి నాయుడు, మాజీ ఎంపిపి కొళ్లి రమణమూర్తి, మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

రామభద్రపురం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సర్కిల్ సిఐ నారాయణరావు సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా అపరిచిత వ్యక్తులు కాల్ చేసి బ్యాంకు ఖాతాలు, బ్యాంకు ఓటిపి నెంబర్లు చెప్పమన్నా చెప్పవద్దన్నారు. బ్యాంకు అధికారులమని చెప్పి మోసాలు చేస్తున్నారని, వీటిపై కూడా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి అపరాధ రుసుం కింద రూ. 10వేలు విధించే చట్టం ఉందన్నారు. అనంతరం పోలీసు స్టేషన్ రికార్డులు పరిశీలించారు.

'సీతం'లో బాలికల బెటాలియన్ శిక్షణ క్యాంప్

విజయనగరం టౌన్: సీతం కళాశాలలో బాలికల బెటాలియన్ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర, ఈ శిబిరంలో పది రోజులు ఉండటానికి ఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. భవిష్యత్తులో యువత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఆపరేషన్ సింధూర్ గురించి వివరించారు. డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ మీసాలా సత్యజిత్, సుబేదార్ మేజర్ బోస్లే, పది మెస్సర్ సింగ్, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ల లెఫ్టినెంట్ మజ్జి వరలక్ష్మి, మూడో అధికారి వెంకట రత్నం, లెఫ్టినెంట్ ఆముతా, లెఫ్టినెంట్ సుగీత, లెఫ్టినెంట్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జెవివి వేసవి వినోద శిబిరం

విజయనగరం టౌన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విజయనగరంలో గత 10 రోజులుగా జరిగిన వేసవి వినోద కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వేసవి వినోద కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు జెవివి సమత కన్వీనర్ జి. నిర్మల బహుమతి ప్రదానం చేశారు. కేక్ కట్ చేసి ముగింపు సంబరాలు చేశారు. అనంతరం నిర్మల మాట్లాడుతూ విజ్ఞానం..వినోదం..వికాసం..విహారం మేళవింపుగా ఎంతో ఆహ్లాదంగా ఆనందంగా ఈ కార్యక్రమం జరిగిందన్నారు. అందుబాటులోకి వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పిల్లలు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లలు డ్రాయింగ్, ప్రయోగాలు, క్రీడల లో ఎంతో ఉత్సాహంగా నిర్వహించారన్నారు.



వేసవి వినోద కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

ప్రాజెక్టుల ద్వారా తాగునీరివ్వరా?

◆డెంకాడలో వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం ◆ ప్రోటో కాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ ◆ తెర్లాంలో సాదాసీదాగా సమావేశం

ప్రజాశక్తి- డెంకాడ

ప్రాజెక్టులు ద్వారా తాగునీరు సరఫరా చేయరా అని పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ఒక్కొక్క శాఖపై రివ్యూ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ మాట్లాడుతుండగా సభ్యులు కలగుజేసుకుని గుణుపూర్‌పేట రాజాపులోవ దగ్గర ఉన్న తాగనీరు ప్రాజెక్టు ద్వారా గ్రామాలకు తాగునీరు రావడంలేదన్నారు. జొన్నాడ వద్ద ఉన్న ప్రాజెక్టు వన్ నుంచి 18 గ్రామాలకు తాగునీరు రావాల్సి ఉందనీ కానీ ఒక గ్రామానికి కూడా నీరు రావడం లేదని వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, జొన్నాడ ఎంపిటిసి శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. గుణుపూర్ పేట వద్ద ఉన్న ప్రాజెక్టు నుంచి ఒక్క గ్రామానికి కూడా నీరు అందడం లేదని మండిపడ్డారు. ముఖ్యంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులుపై గాని సమావేశాల గురించి గానీ గ్రామాల్లో ఉన్న సర్పంచులు, ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. కనీసం ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ ఎపిఒ తమకు సమాచారం ఇవ్వడం లేదని వైస్ ఎంపిపి తమ్మినాయుడు, చింతలవలస సర్పంచ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పినతాడివాడ సర్పంచ్ లంక లక్ష్మణరావు అధికారులు సమాచారం ఇవ్వడం లేదని అడుగుతుండగా అక్కివరం సర్పంచ్ కంది కిరణ్ కుమార్ అడ్డు తగలడంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఒకరిని ఒకరు తోసుకున్నంతవరకు వచ్చింది. ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన సమాచారాన్ని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులకు తెలిపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ వై. భవాని, తహశీల్దార్ వి.పద్మావతి, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



డెంకాడ: ఎంపిడిఒ, ఎంపిపిలకు సమస్యలపై వినతినిస్తున్న రామారావు

మోదవలసలో దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలి

మండలంలోని మోదవలస గ్రామంలో దీర్ఘంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆ గ్రామ సర్పంచ్ భర్త కనకల రామారావు శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కోరారు. ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు, ఎంపిడిఒ వైభవానికి వినతి పత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే లోకం మాధవి దృష్టికి కూడా తమ సమస్యలను తీసుకెళ్లామన్నారు. గ్రామంలో 26వజాతీయ రహదారి నుండి కొండయ్య పాలెం మీదగా సచివాలయం, సిసి రోడ్డు నిర్మించాలన్నారు. జాతీయ రహదారి నుండి వల్లూరు మీదగా బంగార్రాజుపేటకు తారు రోడ్డు నిర్మించాలన్నారు. గతంలో మోధవలసలో ఎయిడెడ్ పాఠశాల ఉండేదని దానిని తొలగించారని ఇప్పుడు పిల్లలు పక్క గ్రామానికి స్కూల్‌కి వెళ్ళవలసి వస్తుందని గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. రైతు సేవా కేంద్రం, అంగన్వాడీ, వెల్నెస్ సెంటర్, సచివాలయం నిర్మాణం మధ్యలో ఆగిపోయాయని వాటికి నిధులు విడుదల చేసి పూర్తి చేయాలన్నారు. గ్రామంలో జాతీయ రహదారి పక్కన ఉన్న వ్యవసాయ మార్కెటింగ్ స్థలాన్ని పరిరక్షించి దాని చుట్టూ ప్రహరీ నిర్మించి అభివృద్ధి చేయాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పని కల్పించాలని కోరారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

తెర్లాం: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి ఎం.ఉమాలక్ష్మి ఆధ్వర్యంలో సాదాసీదాగా సాగింది. కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సిఎస్ డిటి స్వర్ణలత తెలిపారు. కునయవలస సర్పంచ్ విజయబాబు సచివాలయంలో పనిచేస్తున్న అగ్రికల్చరల్ అసిస్టెంట్ వెంకటేష్ సరిగా విధులకు హాజరు కావడం లేదని రైతులకు అందుబాటులో ఉండటం లేదని ఎప్పుడు ఉద్యోగానికి వస్తున్నారో ఎప్పుడు వెళ్తున్నారో కూడా తెలియడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మండల ఎఒ సునీల్ కుమార్ అతనితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. ఎస్ఐ సాగర్‌బాబు ప్రతిపక్ష నాయకులను అవమానిస్తూ, హేలన చేస్తూ మాట్లాడుతున్నారని కునయవలస సర్పంచ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపిపి ఈ విషయం తమ దృష్టికి కూడా వచ్చిందని వెంటనే అతని తీరుపై ఎస్‌పికి ఫిర్యాదు చేస్తామని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ రాంబాబు, తహశీల్దార్ హేమంత్ కుమార్, వైస్ ఎంపిపిలు సత్యనారాయణ, రమాదేవి, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కొత్తవలస

జాతీయ డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇది దోమల వల్ల వచ్చే వ్యాధి అని, అందుకు అనుగుణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తవలస పిహెచ్‌సి వైద్యాధికారి సీతల్ వర్మ తెలిపారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 4 నెలలు ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని, వర్షా కాలంలో నీటి నిల్వ వల్ల దోమలు వ్యాప్తి జరుగుతుందని, దోమలు వల్ల ప్రధానంగా డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు సంక్రామిస్తాయని చెప్పారు. ప్రధానంగా వీటిలో మంచినీటిలో పుట్టే దోమలు వల్ల డెంగీ వ్యాధి వస్తుందని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమలు వ్యాప్తిని అరికట్టాలని, దోమతెరలు వాడాలని, ఇంటి కిటికీలకు దోమతెరలు కట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యులు డాక్టర్ తిరుపతిరావు, ఇఒ సన్యాసినాయుడు, హెచ్‌వి నిర్మల, హెచ్ఎస్ సూరిదేముడు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ: వేపాడ, బొద్దాం పిహెచ్‌సిల పరిధిలో జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకొని డాక్టర్ ఏ.సంజనా, శివాని, గగనసింధు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహిం చారు. డెంగీ వ్యాధి, ఫ్రైడే డ్రై డే పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ వెంకట రమణ, బొద్దాం పిహెచ్‌సి హెచ్ఎస్ మూర్తి, హెచ్‌వి లక్ష్మి, వల్లంపూడి, వేపాడ ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: మండలంలోని పాతబగ్గాంలో శుక్రవారం డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడి, ఆరోగ్య కార్యకర్తలు ప్రజలకు డెంగీ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మురికి కాలువలు, నీటి తొట్టిలో నిల్వ ఉన్న మరుగునీరు మున్సిపాలిటీ సిబ్బంది ద్వారా తొలగించే కార్యక్రమం నిర్వహించారు. నీరు నిలవ ఉంటే వాటి ద్వారా దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు సోకే అవకాశం ఉందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమా, ఆశా వర్కర్లు లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

లక్కవరపుకోట: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి- రేగిడి

నీటి తీరువా బకాయిలు లక్ష్యాలకు మించి చేరుకోవాలని చీపురుపల్లి ఇంఛార్జి ఆర్‌డిఒ బి. ఆశయ్య ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో విఆర్‌ఒలు, విఎస్‌లతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మూడు కోట్లకు పైబడి నీటి తీరువా బకాయిలు పేరుకుపోయాయన్నారు. సచివాలయ పరిధి గ్రామాల్లో నీటి తీరువా బకాయిలు శత శాతం వసూళ్లకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది వసూళ్లకు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. భూ రీ సర్వే నిష్పక్ష పాతంగా వ్యవహరించి, రైతులకు నికరమైన భూ విస్తరణ తేల్చి, రైతులకు పట్టాలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భూ రీ సర్వేలో రైతుల నుంచి ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు. సర్వేయర్లు టీమ్ వారీగా పని చేయా లన్నారు. చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు తప్పవ న్నారు. మ్యుటేషన్ల ప్రక్రియ పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. పిజిఆర్ఎస్, జిఎంఎస్ నెంబర్ 30పై విఆర్‌ఒలు దృష్టి సారించా లన్నారు. ఈ సమావేశంలో తహశీల్దారు ఈశ్వర రావు, సర్వేయర్ రామారావు, ఆర్ఐ రేవతి, మురళి పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం సందర్శన

సంతకవిటి: స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్‌డిఒ బి. ఆశయ్య శుక్రవారం సందర్శించారు. ఈ మేరకు మండలంలోని రీసర్వే, వాటర్ టెక్స్ బిల్లు తదితర అంశాలపై గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సమస్యలను పరిష్కారం చేయాలని ఆదేశించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి. సత్యం, డిటి రంజిత్‌కుమార్, ఆర్ఐ పాల్గొన్నారు

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి

ప్రజాశక్తి- బొండపల్లి

ప్రతీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఆయన ప్రజా దర్బారు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లగా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా దర్బారు ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా సచివాలయాల ద్వారా పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు డి. రాజేశ్వరరావు, ఎంపిడిఒ తులసీనాద్, విద్యుత్ శాఖ ఎఇ జి.శంకర్, ఆర్‌డబ్ల్యుయస్ ఎఇ సునీల్, పంచాయతీ రాజ్ ఎఇ పి.అప్పల నాయుడు, ఎపియం పెంటంనాయుడు, ఎపిఒ అరుణ, సర్పంచ్‌లు బొండపల్లి ఈశ్వరరావు, కర్రోతు శ్రీనివాసరావు, నంబూరి రాజేష్, ఈదుబిల్లి కృష్ణ, నడుపూరి భాస్కర నాయుడు, మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి- డెంకాడ

గ్రామస్థాయిలో నేరాల నియంత్రణకు సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. పాత నేరస్థులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు, ఒంటరి మహిళలు, శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యే అంశాలు గురించి సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. డెంకాడ పోలీసు స్టేషను పక్కనే అభివృద్ధి చేసిన భవనంలో ఏర్పాటు చేసిన భోగా పురం సర్కిల్ కార్యాలయాన్ని, సిఐ చాంబర్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం మహిళా సంరక్షణ పోలీసులు, పోలీసు స్టేషను సిబ్బందితో ఆయన మాట్లాడారు. నేర నియంత్రణ, సమాచార సేకరణ, నిఘా ఏర్పాటు చేయడంలో క్షేత్ర స్థాయిలో మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత పోలీ సులు నిర్వహించే విధులే క్రియాశీలక మన్నారు. మహిళా పోలీసులు నిర్వహించే విధులను పర్యవేక్షించేందుకు ఇటీవల ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ప్రారంభించామన్నారు. ఎంఎస్‌పిలు నిర్వహించే విధులను ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా రూపొం దించిన వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. ఈ-బీట్స్ సమర్థవం తంగా అమలు చేయాలని, దత్తతగా గ్రామాలను విధిగా సందర్శిం చాలని, గ్రామంలో ఎటువంటి అసాంఘిక కార్యక లాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, సమాచారాన్ని సంబంధిత ఎస్‌హెచ్ఒకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీని వాసరావు, భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, ఎస్ఐలు ఎ.సన్యాసినాయుడు, ఐ.దుర్గాప్రసాద్, గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌పి

జులైలో జెవివి రాష్ట్ర మహాసభలు

వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కడప జిల్లాలో జులైలో జరగనున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జెవివి జిల్లా అధ్యక్షులు ఆనంద్ అధ్యక్షతన జిల్లా స్థాయి విస్తృత సమావేశం గురజాడ స్కూలులో జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో జెవివి ఆధ్వర్యాన మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాష్ట్ర నాయకుడు కాలా సుధాకరరావు మాట్లాడుతూ రానురాను మనం తెలుగు బాషను మర్చి పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుభాషను సులభంగా ఎలా నేర్పించాలి? అన్న మెలకువలు సభికులకు నేర్పించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంవిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా నిరక్షరాస్యులు, పేదలు, గిరిజనులు ఉన్నారని, ఇలాంటి వెనుక బడిన జిల్లాను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆనంద్ మాట్లాడుతూ ఈనెల 25న విజయనగరం ఉమ్మడి జిల్లాల మహాసభలు జరుగబోతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ పైల రమేష్ రాజు, గంట్రేటి లక్ష్మణరావు, డాక్టర్ రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రంజిత్‌కుమార్, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

సారా రహిత గ్రామానికి సహకరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సారా రహిత గ్రామానికి అన్ని వర్గాలూ సహకరించాలని ఎక్సైజ్ సిఐ ఎం.వెంకటరావు కోరారు. శుక్రవారం సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి సీతారామునిపేట సచివాలయం పరిధిలో కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధి అప్పయ్యపేట వాసులతో నెల్లిమర్ల ఎక్సైజ్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకట్రావు మాట్లాడుతూ సారా రహిత గ్రామాలుగా తీర్చి దిద్దడానికి అందరూ సహకరించాలని కోరారు. ముఖ్యంగా కొత్తపేట పరిధి అప్పయ్య పేట గతంలో నాటు సారా తయారీ కేంద్రంగా ఉండేదని ప్రభుత్వం చొరవతో సారా తయారీ, అమ్మకాలు, తాగడంపై అవగాహన కల్పించామని చెప్పారు. దీంతో అప్పయ్యపేట వాసులు మేల్కొని నాటుసారా తయారీ మానివేయడం శుభపరిణామమన్నారు. సారా రహిత గ్రామాలకు అన్ని వర్గాల ప్రజలూ సహకరించాలని కోరారు. అనంతరం కొత్త పేట సర్పంచ్ అట్టాడ శ్రీను ఆధ్వర్యంలో యువత సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సి వి. కృష్ణ, పంచాయతీ కార్యదర్శి కె. బంగార్రాజు, యువత టి. రమేష్, పవన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ గుడిసెలు దగ్ధం

ప్రజాశక్తి- పూసపాటిరేగ

మండలంలోని చోడమ్మ అగ్రహారం పరిధిలోగల బాలాజీ పౌల్ట్రీ ఫారంలో సుమారు 34 తాటాకు షెడ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఉపాధి హామీ పథకంలో భాగంగా సమీపంలో చెరువులో డొంకలకు కూలీలు పెట్టిన నిప్పు రాజుకొని సమీపంలో ఉన్న పౌల్ట్రీ ఫామ్‌కు అంటుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ పౌల్ట్రీ ఫామ్‌లో 90 వరకు తాటాకు షెడ్లు ఉన్నాయని 34 షెడ్లు కాలిపోయాయని యజమాని బి.సుధాకర్ రెడ్డి తెలిపారు. కాలిపోయిన షెడ్లు విలువ సుమారుగా రూ.50 లక్షల వరకూ ఉంటుందని అంచనా వేశామన్నారు. సంఘటన స్థలానికి రణస్థలం ఫైర్ ఇంజిన్‌తో పాటు అరబిందో రెడ్డీస్‌కు చెందిన ఫైర్ ఇంజన్లు కూడా వచ్చి మంటలను అదుపు చేశాయి. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని యజమాని కోరారు.

లారీ ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలో తుమికాపల్లి గ్రామం వద్ద ఉన్న స్థానిక ఫైర్ స్టేషన్ దగ్గర అధిక లోడుతో విశాఖపట్నం నుంచి ఎస్.కోట వెళ్తున్న లారీ శుక్రవారం ఏడేళ్ల బాలుడుని ఢీకొట్టింది. దీంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. 9 సంవత్సరాల వయస్సుగల తన అక్క చందశ్వితో కలిసి పాలు ప్యాకెట్ కోసం రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తుమికాపల్లి గ్రామంలో జగన్నాథ లేఅవుట్‌లో శ్రీసాయిసంపత్ రెసిడెన్సి భవనంలో వాణికుమారి ఇద్దరు పిల్లలతో జీవనం గడుపుతుంది. అయితే తన పిల్లలిద్దరూ పాల ప్యాకెట్‌కు వెళ్లి అందులో ఒకరు మృతి చెందడంతో ఆమె కన్నీటి పర్యంతమవుతున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న కొత్తవలస పోలీసులు లారీని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

16 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- కొత్తవలస

కొత్తవలస సిఐ సిహెచ్ షణ్ముఖరావు తన సిబ్బందితో కలిసి శుక్రవారం రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా 16 కిలోల గంజాయితో యువకులు పట్టుబడినట్లు తెలిపారు. ప్లాట్ ఫామ్ నెంబర్ వన్ వద్ద నలుగురు వ్యక్తులు రెండు బ్యాగులతో గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. విజయవాడ వాంబేకాలనికి చెందిన జోజిబాబు, శామ్యూల్ జాన్, మణికంఠ, మహేశ్వరరావులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒరిస్సా నుంచి గంజాయిని విజయవాడకు తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు.

గర్భిణీకి అర్చకుడు రక్తదానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని జరజాపుపేటకు చెందిన అర్చకుడు గర్భిణికి రక్తదానం చేశారు. శుక్రవారం గోషా హాస్పిటల్‌లో గర్భిణికి అరుదైన బ్లడ్ గ్రూప్ ఎబి పాజిటివ్ అత్యవసరం కావడంతో రోగి బంధువులు జరజాపుపేట సాధన యువజన సంఘాన్ని సంప్రదించారు. ఈ నేపథ్యంలో జరజాపుపేట సంతోషిమాత ఆలయ అర్చకులు వంశీ పంతులుని సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి విజయనగరం ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా త్వరితగతిన పేషెంట్ బంధువులకి రక్తం అందజేయడంతో రక్తదాతని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, పేషెంట్ కేర్ టేకర్, సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్ రావు, పసుమర్తి వెంకటరమణ తదితరులు అభినందించారు.

గిరిజనులను మోసగిస్తున్న పాలకులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులను నేటికీ మోసం చేస్తున్నాయని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆరోపించారు. గిరిజన గ్రామాలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ పరిధిలో గల రేగ పుణ్యగిరి గిరిజనులతో కలసి ఎంపిడిఒ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ సతీష్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మద్దిల రమణ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 78 ఏళ్లు కావస్తున్నా అటవీ ప్రాంతాల్లో నివాసముంటున్న గిరి పుత్రులకు నేటికీ స్వాతంత్రం రాలేదని, గిరిజనుల నివాస ప్రాంతాలకు రోడ్లు ఉండవు, తాగునీరు సౌకర్యం ఉండదు, పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం ఉండదని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలు ఉండవని, ఉన్నా పాఠశాలలకు సక్రమంగా ఉపాధ్యాయులు వెళ్లరని చెప్పారు. పూర్తిస్థాయిలో వైద్యసౌకర్యాలు ఉండవని, మైదాన ప్రాంతాలకు వైద్యం నిమిత్తం వెళ్లాలంటే డోలిమోతలు తప్పడం లేదని గుర్తు చేశారు. మండలంలోని దారపర్తి పంచాయతీ పరిధి, ఎస్‌కోట పంచాయతీ పరిధిలో రేగపుణ్యగిరి ప్రాంతాల్లో ఆగిన రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30లోగా గిరిజనుల గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించకుంటే గిరిజనులను ఐక్యం చేసి ఎంపిడిఒ కార్యాలయం వద్ద వంటావార్పు చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు చెలికాని ముత్యాలు, సిదర అర్జున్, గేమ్మేల సన్యాసిరావు, రమేష్ రాజు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - బొబ్బిలి

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం రైతులకు నవ ధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. నవ ధాన్యాలు సాగుతో అధిక లాభాలు ఉండడంతో ప్రభుత్వం సాగును ప్రోత్సహిస్తుందని చెప్పారు. నవ ధాన్యాలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. ఖరీఫ్ సాగుకు రైతులకు సంపూర్ణంగా ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ ఏడి ఎం.శ్యామసుందర్, రైతులు పాల్గొన్నారు.

నేడు బొబ్బిలిలో తిరంగా ర్యాలీ

ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన సైనికులకు అండగా నిలిచేందుకు శనివారం పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ కోటలో శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని, రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

20లోగా వివరాలు తెలపండి

కొత్తవలస: మండలంలో ఉన్న రైతులు అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందడానికి ఈనెల 20వ తేదీలోగా తమ ఆధార్ వివరాలు తెలియజేయాలని మండల వ్యవసాయ అధికారి కె. మాధురి శరణ్య తెలిపారు. శుక్రవారం మండలంలో మిందివలస, రామచంద్రపురం, దెందేరు గ్రామాల్లో అన్నదాత సుఖీభవ పథకం కోసం వ్యవసాయ సహాయకులు చేస్తున్న వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కోసం లబ్ధి పొందాలంటే రైతులు ఈ నెల 20వ తేదీ లోపు తమ ల్యాండ్ 1బి, ఆధార్, రేషన్ కార్డులు గ్రామంలో గల రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించి తమ వివరాలు అప్డేట్ చేయించుకోవాలని తెలిపారు. ఎవరైనా కౌలు రైతులుంటే గ్రామ వ్యసాయ సహాయకులుకు తెలియచేసి విఆర్‌ఒతో ఆన్‌లైన్ చేసుకొని సీసీఆర్‌సి కార్డు పొందాలని తెలిపారు. ఈ కార్డు ద్వారా కౌలు రైతులు వేసిన పంటను ఈ పంట చేయించుకోవాలని తద్వారా రైతులు తమ ధాన్యం అమ్మడానికి కూడా వీలవుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో విఎఎ కె.లక్ష్మి, కె.హేమ తదితరులు పాల్గొన్నారు.